సాక్షి
రంగారెడ్డి

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



నగల ఆనవాళ్లతో కేసు కొలిక్కి

గుర్తు తెలియని మహిళ హత్య కేసును పహాడీష రీఫ్ పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. 8లో▸

ఎయిర్‌పోర్టుకు 2 అవార్డులు

శంషాబాద్: ల్యాండ్ స్కేపింగ్‌లో జీఎంఆర్ అంతర్జాతీయ విమానాశ్రయం రెండు అవార్డులను దక్కించుకుంది. ప్రైవేటు కంపెనీలు నిర్వహిస్తున్న ల్యాండ్ స్కేపింగ్ 90 ఎకరాలకు పైగా, దీంతో పాటు ట్రాఫిక్ ఐలాండ్‌లను తీర్చిదిద్దిన తీరుతో అత్యుత్తమంగా నిలిచాయి. నాంపల్లిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా జీఎంఆర్ ఎయిర్‌పోర్టు ప్రతినిధులు ఈ అవార్డులను అందుకున్నారు.

ప్రశాంతంగా బీఎల్‌వీ సెట్

మొయినాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకోసం ఆదివారం నిర్వహించిన బీఎల్‌వీ సెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 13 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష రాశారు. మొత్తం 5,251 మంది దరఖాస్తు చేసుకోగా 4,499 మంది హాజరైనట్లు సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద తెలిపారు.



న్యూస్‌రీల్

తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ చైర్మన్‌గా రాజావరప్రసాద్



షాద్‌నగర్: తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా షాద్‌నగర్ పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు వనారస రాజావరప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్ఎస్ పార్టీలో సామాన్య కార్యకర్తగా కొనసాగుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఎన్నో పోరాటాలు చేసిన రాజావరప్రసాద్ జైలు జీవితాన్ని కూడా అనుభవించారు. కోఆపరేటివ్ చైర్మన్‌గా నియమించినందకు ఆయన వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటింటికీ సీపీఐ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తుర్కయంజాల్: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య విమర్శించారు. తుర్కయంజాల్‌లో ఆదివారం ఇంటింటికీ సీపీఐ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలతో సామాన్యులపై పెనుభారం పడుతోందని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. లాభాల్లో నడుస్తున్న సింగరేణి, ఎల్ఐసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.శివకుమార్, సీపీఐ నాయకులు గువ్వల రాజు, జనార్దన్, వెంకటేశ్, కొట్యా భాస్కర్, పిల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ కిడ్నాప్

- కారులో వస్తుండగా దాడిచేసి లాక్కెళ్లిన వ్యక్తులు
- పాత కక్షలే కారణమని అనుమానాలు



కిడ్నాప్‌నకు గురైన కరుణాకర్‌రెడ్డి (ఫైల్)

కొత్తూరు: డాక్యుమెంట్ రైటర్ కిడ్నాప్‌నకు గురైన సంఘటన కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తూరు మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన మామిడి కరుణాకర్‌రెడ్డి (29) డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం బంధువులు శ్రీధర్‌రెడ్డి, రాంచెంద్రారెడ్డితో కలిసి కారులో మల్లాపూర్ నుంచి బయలుదేరారు. నందిగామ మండలం మామిడిపల్లికి చెందిన రాంచెంద్రారెడ్డిని వారి ఇంట్లో దిగబెట్టి తిరుగుపయనమయ్యారు. తీగాపూర్ శివారులోకి రాగానే ఎదురుగా మరో కారులో మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి సోదరులు విక్రమ్‌రెడ్డి, విష్ణువర్దన్ రెడ్డి, అతడి అనుచరులు ఆరిఫ్, అరుణ్‌రెడ్డి తమ కారును అడ్డుగా పెట్టారు. అంతటితో ఆగకుండా కరుణాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి ప్రయాణిస్తున్న కారు అద్దాలు పగులగొట్టి ఇద్దరిపై దాడి చేశారు. కరుణాకర్‌రెడ్డిని తమకారులోకి బలవంతంగా ఎక్కించుకుని వెళ్లారు. వెంటనే తేరుకున్న శ్రీధర్‌రెడ్డి ఘటనపై బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. పాతకక్షల నేపథ్యంతోనే కిడ్నాప్ జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కిడ్నాప్‌నకు గురైన కరుణాకర్‌రెడ్డి గతంలో ఓ మీడియా సంస్థలో విలేకరిగా పనిచేశాడు. శ్రీధర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

సర్కారు భూమికి ఎసరు!

అజీజ్‌నగర్‌లో ఆక్రమణల పర్వం

- సర్వే నంబర్ 49లోని ప్రభుత్వ భూమిపై కన్ను
- బహిరంగ మార్కెట్లో ఎకరం రూ.6 కోట్ల నుంచి 7 కోట్లపైనే..
- ఇప్పటికే ఓ వ్యక్తి కబ్జాలో 30 గుంటల భూమి
- ఖాళీస్థలాల్లో రాత్రికి రాత్రే వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు
- నిస్సహాయ స్థితిలో రెవెన్యూ యంత్రాంగం



ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలు



చదును చేసిన ప్రభుత్వ భూమి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ భూముల ఆక్రమణల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎప్పటికప్పుడు నిఘా పెట్టి, వాటికి రక్షణ కల్పించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఫలితంగా ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములు కాస్తా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయి. ఇప్పటికే బాలాపూర్, మహేశ్వరం, అబ్దుల్లాపూర్‌మెట్, ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, శంకర్‌పల్లి మండలాల్లో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాగా.. తాజాగా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోనూ కొనసాగుతోంది.

రాత్రికి రాత్రే హద్దురాళ్లు

మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 49లో మొత్తం 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొంత భాగం శ్మశానవాటికకు, మరికొంత భూమి సబ్ స్టేషన్‌కు కేటాయించారు. ప్రస్తుతం 12 ఎకరాలు ఖాళీగా ఉంది. బహిరంగ మార్కెట్లో ఎకరం రూ.6 నుంచి రూ.7 కోట్ల వరకు ధర పలుకుతోంది. నగరానికి ఆనుకుని ఉండటం, భూముల ధరలకు రెక్కలు రావడంతో కొంతమంది కబ్జాదారుల కన్ను ఈ భూములపై పడింది. స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి ఇప్పటికే 30 గుంటలకుపైగా ఆక్రమించి తాత్కాలిక నిర్మాణాలు కూడా చేపట్టాడు. మిగిలిన భూమిపై మరికొంత మంది దృష్టి పడింది. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో రాత్రికిరాత్రే ఆ భూమిని ఆక్రమించి, చుట్టూ హద్దురాళ్లు పాతి తక్కువ ధరకు అమ్మేస్తున్నారు.

వీకెండ్‌లో నిర్మాణ పనులు

వర్కింగ్ డేస్‌లో పనులు చేపడితే రెవెన్యూ అధికారులకు తెలిసి అడ్డుకుంటారనే అనుమానంతో ఇందుకు వీకెండ్‌ను అనువైన రోజుగా ఎంచుకుంటున్నారు. జేసీబీలు తీసుకొచ్చి గుట్టుగా భూమిని చదును చేయిస్తున్నారు. 60 గజాలు, 100 గజాలు, 120 గజాల చొప్పున ప్లాట్లు చేసి, వాటికి హద్దురాళ్లు పాతేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా అమాయక పేదలకు వీటిని అంటగడుతున్నారు. పొజిషన్ ఇప్పించినందుకు ఒక్కో వ్యక్తి నుంచి రూ.6 లక్షలు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. తక్కువ ధరకే ఇంటి స్థలం దొరుకుతుండటం, ప్రభుత్వం కూడా 58,59 జీఓల కింద వీటిని రెగ్యులరైజ్ చేస్తుండటం, స్థానిక ప్రజాప్రతినిధుల మద్దతు కూడా లభిస్తుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఏమీ ఆలోచించకుండా వారు అడిగినంత ముట్టజెబుతున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రాత్రికి రాత్రే వాటిలో తాత్కాలిక నిర్మాణాలు చేపడుతున్నారు. తీరా రెవెన్యూ అధికారులు జేసీబీలతో వచ్చి వాటిని కూల్చేస్తుండటంతో లబోదిబోమంటున్నారు.

ఉపేక్షించేది లేదు

అజీజ్‌నగర్ రెవెన్యూ సర్వే నంబర్ 49లోని భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల అంశం ఇప్పటికే మా దృష్టికి వచ్చింది. ఆదివారం ఉదయమే వాటిని కూల్చివేయాలని నిర్ణయించినా స్థానికంగా మంత్రి కార్యక్రమం ఉండటంతో నిలిపివేశాం. వెంటనే వాటిని కూల్చివేస్తాం. ఆక్రమణదారులు ఎంతటి వారైనా ఉపేక్షించబోం. ప్రభుత్వ భూమిలో నోటీసు బోర్డు నాటడంతో పాటు దాని చుట్టూ రక్షణ చర్యలు చేపడతాం.

– అశోక్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్



షాబాద్: బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

దేశం చూపు తెలంగాణ వైపు

- ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి
- వ్యవసాయ రంగానికి సీఎం పెద్దపీట
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

షాబాద్: దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ నుంచి పామెన వరకు రూ. 5 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులకు జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ దేశవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. రూ.లక్షల కోట్ల అప్పుతెచ్చిన బీజేపీ ఏం అభివృద్ధి చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి ఇంటికీ నీటిని ఇచ్చిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ అని తెలిపారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా వ్యవసాయ రంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వంపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేసే విమర్శలను ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీకి చెందిన నాయకులను నిలదీయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతి రెడ్డి, మొయినాబాద్ జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, జిల్లా లీగల్ అడ్వైజర్ పీసరి సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం

మొయినాబాద్‌రూరల్: అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ పాత చౌరస్తా నుంచి బాకారం వరకు రూ.1.30 కోట్లతో చేపట్టిన డబుల్ రోడ్డు పనులకు, రూ.5 కోట్లతో చిన్న మంగళారం మూసీ వాగుపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపనతోపాటు రూ.5 కోట్లతో నక్కలపల్లి ఈసీ వాగుపై చేపట్టిన వంతెన నిర్మాణానికి ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంలో చూసినా బీఆర్ఎస్ పార్టీని స్వాగతిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా ఉపాధ్యక్షురాలు ముదిగొండ మంజుల, మాజీ ఎమ్మెల్యే రత్నం, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నరోత్తమ్‌రెడ్డి, ఎంపీపీ నక్షత్రంజేవంతు, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలి మాటలు నమ్మొద్దు



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి సబితారెడ్డి

- అలా మాట్లాడేవారిని పట్టించుకోవద్దు
- ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్: ప్రతిపక్ష నాయకులు గాలికి తిరుగుతూ గాలి మాటలు మాట్లాడతారని.. వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు. మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. నోరుంది కదాని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. తమ కుటుంబంలో మంత్రి పదవికోసం ఏనాడూ పాకులాడలేదని స్పష్టం చేశారు. 22 ఏళ్ల క్రితమే మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలివేశానన్న సంగతి మర్చిపోవద్దన్నారు. ప్రాణం ఉన్నంత వరకు జనం కోసమే బతుకుతానని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గమే తన ఇల్లని, నియోజకవర్గ ప్రజలే తన ఆత్మీయులన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, క్లైం ఎల్లారెడ్డి, భారతమ్మ, రఘునందన్‌చారి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్య@40

- మండుతున్న ఎండలు
- ఉక్కపోతతో అల్లాడుతున్న జనం

తుర్కయంజాల్: ఎండలు మండిపోతున్నాయి. వేసవి తాపానికి జనం అల్లాడి పోతున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయట తిరగాలంటేనే వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాల కారణంగా శనివారం వరకు జిల్లాలో 35 డిగ్రీల నుంచి 36 డిగ్రీల లోపు మాత్రమే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తిరిగి ఆదివారం ఉదయం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో 40 డిగ్రీలకు మించి పలు చోట్ల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండకు తోడు ఉక్కపోత అధికంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 40 డిగ్రీల కంటే అదనంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.



ఎండ వేడికి ఆదివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన సాగర్ రహదారి

గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతల వివరాలు (సెల్సీయస్‌లో..)

మండలం	15వ తేదీ	16వ తేదీ
అబ్దుల్లాపూర్‌మెట్	34.9	39.3
హయత్‌నగర్	34.8	38.0
యాచారం	34.9	37.0
మంచాల	34.6	39.0
ఇబ్రహీంపట్నం	37.1	40.1
శంకర్‌పల్లి	33.8	36.6
చేవెళ్ల	33.4	35.0
శేరిలింగంపల్లి	35.0	38.8
గండిపేట	34.0	37.2
మొయినాబాద్	34.2	40.3
షాబాద్	34.0	39.7
కొందుర్గు	34.7	39.5
చౌదరిగూడెం	33.5	36.0
ఫరూఖ్‌నగర్	34.4	38.9
నందిగామ	33.7	38.4
కొత్తూరు	33.6	36.3
శంషాబాద్	37.0	39.5
రాజేంద్రనగర్	34.0	37.8
సరూర్‌నగర్	35.1	39.5
బాలాపూర్	33.4	36.3
మహేశ్వరం	34.5	39.6
కందుకూరు	33.6	36.6
కడ్తాల్	33.5	37.5
కేశంపేట	35.5	39.1
తలకొండపల్లి	35.1	38.9
ఆమనగల్లు	35.4	40.1
మాడ్గుల	36.6	38.6

సాహిత్యం సామాజిక అవసరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

ప్రొఫెసర్ హరగోపాల్

షాద్‌నగర్: సాహిత్యం ఒక సామాజిక అవసరం అని ప్రొఫెసర్ హరగోపాల్ అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయుడు కర్ణకోట రవీంద్రనాథ్ రచించిన నే తిరిగిన నేల అనే పుస్తకాన్ని ఆదివారం పట్టణంలోని పెన్షన్స్ భవనంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరగోపాల్ మాట్లాడుతూ.. రచయితలు సామాజిక మార్పులను పాఠకులకు కళ్లకు కట్టినట్లు సాహిత్య రూపంలో అందించాలన్నారు. నేటి యాంత్రిక యుగంలో చాలామంది పాశ్చాత్య సంస్కృతి పట్ల ఆకర్షితులవుతున్నారని, తద్వార సమాజంలో మానవ సంబంధాలు, విలువలు మంటగలుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోజురోజుకూ హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయి ప్రజల మధ్య ప్రేమాను రాగాలు తగ్గిపోతున్నాయన్నారు. ఆర్థిక వ్యవస్థ అనేది మానవ సంబంధాల మీద దాడి చేస్తుండటంతో వస్తువుల మీద ప్రేమ పెరుగుతోందని, మనుషుల్లో తగ్గుతోందని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సాధనలో కవులు, కళాకారులు తమదైన పాత్ర పోషించారని.. ప్రత్యేక రాష్ట్ర అవశ్యకతను ఆటపాటల రూపంలో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారని ఆయన గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఫలాలు ప్రజలకు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, కార్యవర్గ సభ్యుడు ఉదయమిత్ర, శ్రీనివాస్, కర్ణకోట రాజాజీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యం: కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: తల్లి పాలే బిడ్డకు ఎంతో క్షేమదాయకమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఫ్యాషన్ కోసం చిన్నారులకు డబ్బా పాలు పట్టవద్దని ఆయన సూచించారు. ఆదివారం ప్రధాని మోదీ ఇచ్చిన హెల్తీబేబీ షో పిలుపు కార్యక్రమాన్ని బాగ్‌అంబర్‌పేట సత్య సాయి పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారుల కోసం పోషక ఆహార కిట్లను అందజేశారు. పసిపిల్లలతో కలిసి ఆయన సరదాగా ఫొటోలు దిగారు. చిన్నారుల చిరు నవ్వులను ఆస్వాదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఆడ, మగ పిల్లల నిష్పత్తిలో వ్యత్యాసం రోజు రోజుకు పెరుగుతుండడంతో ప్రధాని భేటీ బచావో- భేటీ పడావో కార్యక్రమాన్ని చేపట్టారని, ప్రస్తుతం అది ఎంతో స్ఫూర్తిదాయకంగా ఫలితం ఇస్తుందని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశంలో మహిళల ఆత్మగౌరవం కోసం 11 కోట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, గద్వాల జిల్లా ఇన్‌చార్జి బి.వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు బి.పద్మావెంకట్‌రెడ్డి, కన్నె ఉమారమేష్ యాదవ్, అమృత తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



అంబేద్కర్ ఆడియో సాంగ్ లాంచ్ చేస్తున్న విమలక్క తదితరులు

షాబాద్: అణగారిన వర్గాలకు మేలు చేసేందుకు కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని అరుణోదయ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కుమ్మరిగూడలో ఆదివారం రాత్రి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో అంబేద్కర్ ఆడియో సాంగ్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా దళితులకు సరైన న్యాయం జరగలేదని, గత పాలకుల నిర్లక్ష్యంతో అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు అందకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు విద్యావంతులైనప్పుడే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. గ్రామాల్లో ఉన్న అంబేద్కర్ యువజన సంఘాలు సమాజాభివృద్ధిలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి పామెన బీంభరత్, దేశమల్ల ఆంజనేయులు, పార్టీ సీనియర్ నాయకులు పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, సర్పంచ్ కేతన రమేష్‌యాదవ్, ఎంపీటీసీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పర్వతాలు

షాద్‌నగర్: కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తోందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు ఆరోపించారు. మోదీకి హటావో.. దేశ్‌కి బచావో కార్యక్రమానికి సంబంధించి వాల్ పోస్టర్‌లను ఆదివారం షాద్‌నగర్ పట్టణంలో సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ కంపెనీలను ప్రైవేటు పరం చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని అన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తీసుకొస్తోందని మండిపడ్డారు. అదేవిధంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన కేంద్రం ఈ రంగాన్ని కూడా కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందని అన్నారు. మోదీ అనుసరిస్తున్న విధానాలు దేశ ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అదే విధంగా దేశంలో దళిత, గిరిజన, మైనార్టీల పైన రోజు రోజుకూ దాడులు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను నాయక్, గోవింద్ నాయక్, షకీల్, గడ్డం జంగయ్య, చంద్రబాబు, రమేష్, మహ్మద్ హుస్సేన్, విఠల్ యాదవ్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



లాలు నాయక్(ఫైల్)

మీర్‌పేట్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయిన సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఉదయ్ భాస్కర్ కథనం మేరకు.. బాలాపూర్ మండలం డీఎస్‌ఆర్ కాలనీకి చెందిన ఎం లాలునాయక్(43) ఆటో నడుపుతు జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్నేహితుల వద్ద ఉన్నానని వస్తానని చెప్పాడు. తర్వాత ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. లాలునాయక్ ఆచూకీ తెలిసి వారు 9490617342, 9505588744 సెల్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

108లో ప్రసవం



కుటుంబ సభ్యులకు శిశువును అప్పగిస్తున్న 108 సిబ్బంది

ఇబ్రహీంపట్నం రూరల్: గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో 108 సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రసవించింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోల్కంపల్లికి చెందిన కల్యాణికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి కాల్ చేశారు. పది నిమిషాల్లో 108 సిబ్బంది కల్యాణి ఇంటికి చేరుకుంది. అప్పటికే నొప్పులు ఎక్కువ కావడంతో 108లోనే పురుడు పోశారు. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటీ భాస్కర్, పైలెట్ శ్రీరామ్ తల్లి, బిడ్డను ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో చేర్పించారు. 108 సిబ్బందిని వైద్యులు అభినందించారు.

రూ. 100కోట్లతో తండాల అభివృద్ధి

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజా సేవకే తన జీవితం అంకితమన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలు, పల్లెల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. నియోజవర్గంలో తండాల అభివృద్ధికి రూ.100 కోట్లతో కార్యచరణ ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. కొత్తగా ఏర్పడిన 54 పంచాయతీల్లో నూతన భవన నిర్మాణాలకు రూ. 10.40 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అలాగే బీటీ రోడ్లకు రూ. 36కోట్లు, ఆమనగల్లులో గిరిజన భవన నిర్మాణానికి రూ. 2కోట్లు విడుదలైనట్లు చెప్పారు. సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 13.29 కోట్లు మంజూరు కావడం జరిగిందన్నారు. ఇతర పంచాయతీల్లో భవనాల నిర్మాణానికి రూ. 16.60 కోట్లు, నియోజకవర్గంలో 37 పల్లె దవాఖానలు మంజూరు కాగా, ఒక్కో దవాఖాన నిర్మాణానికి రూ. 20 లక్షల చొప్పున మంజూరయ్యాయని, త్వరలో వాటిని ప్రారంభిస్తామని చెప్పారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో 108 పాఠశాలల్లో రూ. 69 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రోడ్ల రెన్యూవల్‌కి రూ. 20 కోట్లు, పంచాయతీ రోడ్ల రెన్యూవల్‌కి రూ.25 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. కడ్తాల్ మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో భవన నిర్మాణానికి రూ. 50లక్షలు, మహిళా సమాఖ్య భవనానికి రూ. 20లక్షలు, పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి రూ.1.50 కోట్లు. తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి రూ.1.18 కోట్లు. కేజీబీవీ భవన నిర్మాణానికి రూ.3.10 కోట్ల మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని వివరించారు.

ఆలయ భూములు రైతులకే దక్కాలి

టీఎస్ఐఐసీ తీసుకుంటే ఊరుకోం

- కౌలు రైతులకు అండగా ఉంటాం
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వర ఆలయ భూములు కౌలు రైతులకే దక్కాలని, టీఎస్ఐఐసీ తీసుకుంటే ఊరుకునేది లేదని, రైతులకు మద్దతుగా పోరాటం చేస్తామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బీ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓంకారేశ్వర ఆలయానికి చెందిన 1,400 ఎకరాల భూముల్లో నందివనపర్తి, నస్దిక్‌సింగారం, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన 600 మందికి పైగా రైతులు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. సాగులో ఉన్న రైతులకు కౌలుదారు చట్టం ప్రకారం 1950లోనే 37 ఏ సర్టిఫికెట్లు ఇచ్చారని తెలిపారు. 38ఈ ఇవ్వకుండా సర్కార్ అడ్డుకుందని అన్నారు. కౌలు దారుల చట్టం ప్రకారం ఆ భూములపై హక్కులు కౌలు రైతులకే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ భూముల విషయంలో స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్ఐఐసీ పేరుతో ఆలయ భూములను సేకరించి ఫార్మాసిటీకి కట్టబెట్టాలని సర్కార్ చూస్తోందని ఆయన ఆరోపించారు. నందివనపర్తి, నస్దిక్‌సింగారం, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో కౌలు రైతులకే ఆ భూములు చెందాలని, ఫార్మాసిటీకి ఆలయ భూములు తీసుకోవద్దని పంచాయతీల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పీ అంజయ్య పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఒకరి మృతి



ప్రమాదానికి గురైన కారు



రమేశ్(ఫైల్)

చేవెళ్ల: కారు అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం అక్నాపూర్ గ్రామానికి చెందిన బీ రమేశ్(35) అతని స్నేహితుడు ఎల్ శ్రీకాంత్ మరో ఇద్దరు స్నేహితులు కారులో షాబాద్ మండలంలో స్నేహితుని ఇంటికి వచ్చారు. రాత్రి దావత్ ముగించుకొని తిరుగు ప్రయాణంలో చేవెళ్ల మండలం పామెన బస్ స్టేజికి సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులోని రమేశ్ అక్కడికక్కడే మృతి చెందగా శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు స్నేహితులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాచారం: నాగార్జున సాగర్ - హైదరాబాద్ రహదారిపై వాహనం ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని చంపాపేటకు చెందిన అక్షయ్ కుమార్(25) దుర్గాప్రసాద్ ఆదివారం ఉదయం బైక్‌పై మాల్ మార్కెట్‌కు వెళ్లి మధ్యాహ్నం నగరానికి బయలుదేరారు. సాగర్ రోడ్డుపై తక్కళ్లపల్లి గేట్ వద్ద యాచారం నుంచి మాల్ వైపు వెళ్తున్న వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో అక్షయ్‌కుమార్, దుర్గాప్రసాద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలో అక్షయ్‌కుమార్ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగయ్య తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి



లింగం మృతదేహం

కందుకూరు: చేపల వేటకు వెళ్లిన యువకుడు వలకు చిక్కుకొని మృతి చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కొత్తూర్‌కు చెందిన సీ రాములుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సైదులుకి వివాహం కాగా, చిన్న కుమారుడు లింగం(25) వ్యవసాయ పనులతో పాటు మేకలు మేపుతూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. అతనికి చేపలు పట్టే అలవాటు ఉంది. శనివారం రాత్రి తన మిత్రులు గణేష్, విజయకాంత్‌తో కలిసి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం 8.30గంటలకు లింగం మిత్రులు అతని సోదరుడికి ఫోన్ చేసి కొత్తూర్ పెద్ద చెరువు వద్ద లింగానికి చెందిన బట్టలు, చెప్పులు ఉన్నట్లు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి ఈతగాళ్లతో వెతికించారు. చేపల వలకు చిక్కుకుని లింగం చనిపోయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాచారం: సాగర్ రోడ్డులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రమైన మాడ్గుల్‌కు చెందిన సాయికృష్ణ తన ట్రాక్టర్‌లో ఇసుకను శనివారం రాత్రి యాచారం వైపు తరలిస్తున్నాడు. పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి యాచారం స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



భాస్కర్ రావు (ఫైల్)

మీర్‌పేట్: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ గోవిందు స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం జిల్లెల్‌గూడ కేఆర్ఆర్ హిల్స్‌కు చెందిన జీ భాస్కర్ రావు(38) తాపీ మేస్త్రి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 16న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని భార్య అనురాధ ఫోన్‌కి మెసేజ్ పెట్టాడు. దీంతో ఆమె ఆదివారం మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భాస్కర్‌రావు ఆచూకీ తెలిసిన వారు సెల్ నంబర్లకు 9490617342 790110627 సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

పాఠశాల స్థలం కాపాడాలని ఫిర్యాదు



బధిరుల పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేటలో బధిరుల పాఠశాలకు చెందిన భూమిని ఆక్రమించేందుకు కొందరు యత్నిస్తున్నారని, ఆ భూమిని కాపాడాలని పాఠశాల నిర్వాహకులు ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతకుముందు పాఠశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ నిర్వాహకులు మాట్లాడుతూ.. పాఠశాలకు చెందిన 16 ఎకరాల స్థలాన్ని ఇటీవల కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించేందుకు వచ్చారని, తాము అడ్డుకోవడంతో వెళ్లిపోయారని తెలిపారు. తిరిగి భూమిని ఆక్రమించేందుకు వస్తున్నారని తెలిపారు. పాఠశాల భూమి కబ్జాకు గురికాకుండా చూడాలని పోలీసులను కోరినట్లు స్కూల్ నిర్వాహకులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఐపీ ఉమ్మర్ ఖాన్, చంద్రప్రియ, స్కూల్ ఇంచార్జ్ శ్రీ రమేష్ తెలిపారు.

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై ఫిర్యాదు

చేవెళ్ల: ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, అతని అనుచరుడు అనిల్‌రెడ్డి తన భూమి విషయంలో మోసం చేశాడని బీఆర్ఎస్ నాయకుడు దామోదర్‌రెడ్డి చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలు.. మండలంలోని ఈర్లపల్లి సమీపంలోని తన ఫంక్షన్ హాల్‌ను ఎమ్మెల్యే అనుచరుడు అనిల్‌రెడ్డి కబ్జా చేశారని ఆరోపించారు. అంతేకాకుండా సాయిబాబా మందిరం, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేయకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపాడు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. దామోదర్‌రెడ్డి ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేస్తున్నామని చేవెళ్ల సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరి పాత్ర ఉండాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవీరెడ్డి

బంజారాహిల్స్: సమాజం నుంచి తీసుకోవడమే కాకుండా సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇచ్చేలా ప్రతి ఒక్కరూ తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.మాధవీరెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో ఆదివారం రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి ఎ. భాస్కర్‌రెడ్డి రచించిన 'బాణాపురం టూ బర్మా' పుస్తకాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంతమంది మంది యువత నిరుత్సాహానికి గురవుతుంటారని, అది మంచిది కాదని, జీవితంలో కలలు కనాలని, వాటిని సాధించేందుకు కష్టపడాలని అన్నారు. భాస్కర్ రెడ్డి రవాణా సౌకర్యం లేని గ్రామీణ ప్రాంతం నుంచి ఎంతో కష్టపడి అనుకున్న లక్ష్యాన్ని సాధించారని అన్నారు. దేశానికి వివిధ పదవుల్లో ఆయన సేవలు అందించారని, అంతేకాకుండా తన సొంత ఊరికి ఎంతో చేశారని అన్నారు. పుస్తక రచయిత భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తన ఆటో బయోగ్రఫీ పుస్తకంలో 11 చాప్టర్లు ఉన్నాయన్నారు. తన తొలి అడుగు నుంచి ఇప్పటి వరకు అన్ని సంగతులను ఈ పుస్తకంలో పొందుపర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ టీఎస్ కృష్ణమూర్తి, మాజీ హై కమిషనర్ పార్థసారథి, ఓయూసీఎఫ్ వ్యవస్థాపక ఛైర్మన్ ఆచార్య కొండల్ రెడ్డి, ఆదాయపు పన్ను శాఖ మాజీ చీఫ్ కమిషనర్ జీఆర్ రెడ్డిలతో పాటు పలువురు ఆదాయ పన్ను శాఖ అధికారులు, విశ్రాంత పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నగల ఆనవాళ్లతో కేసు కొలిక్కి



పోలీసుల అదుపులో నిందితుడు శ్రీనివాస్‌రెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శ్రీనివాస్

- గుర్తు తెలియని మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు



సైదమ్మ(ఫైల్)

పహాడీషరీఫ్: గుర్తు తెలియని మహిళ హత్య కేసును పహాడీషరీఫ్ పోలీసులు ఛేదించారు. హత్యకు పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. తుక్కుగూడ కార్యాలయంలో మహేశ్వరం డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, ఏసీపీ అంజయ్య, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం కాశీవిశ్వనాథ్ కేసు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం నేరేడ్వాయి గ్రామానికి చెందిన ఎలయ్య భార్య సైదమ్మ(48) నగరానికి వచ్చి బడంగ్‌పేట ఎంసీఆర్ కాలనీలోని తులసీ కుటీర్ అపార్ట్‌మెంట్‌లో వాచ్ ఉమెన్‌గా పనిచేస్తోంది. ఈమెకు సమీపంలోని టెలిఫోన్ ఎక్ఛేంజ్ కాలనీకి చెందిన రియల్ వ్యాపారి పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో సైదమ్మ అతని వద్ద కొంత నగదు అప్పుగా తీసుకుంది. ఇందుకు సంబంధించిన వడ్డీని నెలనెలా అడుగుతుండడంతో ఆమె చెల్లించలేక పోయింది. ఇదే అదునుగా భావించిన శ్రీనివాస్‌రెడ్డి ఆమెను శారీరకంగా లోబర్చుకున్నాడు. కొన్నాళ్ల అనంతరం ఆమె మరింత డబ్బు అడగడం.. అతడు కాదనడంతో తనతో శారీరకంగా గడుపుతున్న విషయాన్ని నలుగురికి చెబుతానంటూ ఆమె బెదిరింపులకు పాల్పడింది. దీంతో ఆమెను ఎలాగైనా మట్టుబెట్టాలని నిర్ణయించుకున్న నిందితుడు ఈ నెల 10వ తేదీ బడంగ్‌పేట్‌లోని తన ఫాం హౌస్‌కు పిలిపించుకున్నాడు. పథకంలో భాగంగా ముందుగా తెచ్చుకున్న తువ్వాలతో ఆమె గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం ప్లాస్టిక్ బ్యాగ్‌లో కట్టి తన కారులో మృతదేహాన్ని వేసుకొని తుక్కుగూడ హైవేలో అదేరోజు రాత్రి పడేసి పోయాడు. నిందితుడిపై హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

కేసు కొలిక్కి వచ్చిందిలా..

12వ తేదీ ఉదయం ఈ ఘటనను స్థానికుల ద్వారా తెలుసుకున్న పోలీసులు మృతదేహంపై ఉన్న నగల ఆనవాళ్లను మీడియా ద్వారా ప్రచురణ చేయించారు. వేలి ఉంగరాలను గుర్తించిన మృతురాలి కుమారుడు, అల్లుడు పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని సైదమ్మవిగానే గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని చూసి నిర్ధారించారు. పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డిపై అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడు అతడే అని తేల్చారు.

బీసీ కులగణన సాధనకు పోరుబాట

- ఈనెల 23 నుంచి ప్రారంభం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

లాలాపేట: బీసీ కుల గణన చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న నల్గొండ నుంచి నడిగడ్డ వరకు 33 జిల్లాల్లో బీసీల పోరుబాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే క్రమంలో రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న బీసీల పోరుబాటకు బీసీ సంఘాలు, కుల సంఘాలు, మేధావులు, ఉద్యోగులు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం ఓయూ ప్రొఫెసర్స్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కుల గణన చేస్తామని మొట్టమొదటిసారి తెలుగు రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. దీనిని బీసీ సంఘాలన్నీ అభినందిస్తున్నాయన్నారు. సామాజిక న్యాయం వైపు అడుగులేస్తున్న ఏపీ సీఎం జగన్‌ను దేశంలోని ఇతర రాష్ట్రాల సీఎంలు ఆదర్శంగా తీసుకుని అసెంబ్లీలో తీర్మాణాలు చేసి కేంద్రానికి పంపాలని కోరారు. బీసీ కులాల లెక్కలు తేల్చకుంటే భవిష్యత్‌లో రిజర్వేషన్లకు కోతపడే అవకాశం ఉందన్నారు. అందుకే తెలంగాణలో తక్షణమే బీసీ కుల గణనకు చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. ఓబీసీ అని చెప్పుకుంటున్న ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగానికి విరుద్ధంగా అగ్రవర్ణాలకు రిజర్వేషన్ కల్పించారని విమర్శించారు. దేశంలో బీసీలు 67 శాతం ఉంటే రిజర్వేషన్లు మాత్రం 27 శాతం ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఓటు బ్యాంకు కోసం మాత్రమే బీసీల పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయం చేస్తోందన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కులకచర్ల శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు మణిమంజరి, జాజుల లింగం గౌడ్, మహేశ్ యాదవ్, స్వర్ణ, వరికుప్పల మధు, సమతా యాదవ్, గూడూరు భాస్కర్, చందు, రాజు, గౌతమి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్